సచివాలయాల నిధులతో అభివృద్ధి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- రూ.40 లక్షలతో డ్రైనేజ్ కాలువలు, రోడ్ల మరమ్మతులకు శంకుస్థాపన


డ్రైనేజ్ కాలువ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి సచివాలయాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నారని, ఆ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని పాతూరులో రూ.40 లక్షలతో డ్రైనేజ్ కాలువలు నిర్మాణ పనులు, శిథిలమైపోయిన సిమెంట్ రోడ్లను అభివృద్ధి చేయడానికి ఆదివారం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంతో సచివాలయాలు పరిధిలోని అన్ని నివాసాలను సందర్శిస్తున్న సమయంలో స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి ఒక్కో వార్డు సచివాలయానికి రూ.40 లక్షలు మంజూరు అవుతున్నాయి. ఆ మేరకు అధికారులు పంపిన ప్రతిపాదనలు మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. పట్టణంలోని 3, 4 వార్డులకు చెందిన వార్డు సచివాలయం పరిధిలో మూడు నెలల క్రితం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సందర్భంగా ప్రజలు నుంచి వచ్చిన వినతుల మేరకు ఆదివారం పనులకు శ్రీకాం చుట్టామన్నారు. పట్టణంలోని ఇసాక్‌మియా వీధిలో రూ.3.90 లక్షలు, పోకలవారివీధిలో రూ.1.30 లక్షలతో డ్రైనేజ్ కాలువల నిర్మాణం, పోట్లూరువారివీధిలో రూ.5.30 లక్షలు, పోకలవారివీధిలో రూ.2.90 లక్షలు, ఇసాక్‌మియావీధిలో రూ.5.14 లక్షలతో సిమెంట్ రోడ్ల మరమ్మతులు, రూ.1.46 లక్షలతో బోరు నిర్మాణం, గొట్టేటివారివీధిలో డ్రైనేజ్ కాలువ నిర్మాణానికి రూ.1.65 లక్షలు, మఠం బజార్‌లో డ్రైనేజ్ కాలువ, కల్వర్టు నిర్మాణానికి రూ.1.50 లక్షలు, బొమ్మారెడ్డివీధిలో రెండు ప్రాంతాల్లో రెండు డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి రూ.6.20 లక్షలు, రూ.4.32 లక్షలు, వికృతివారి వీధిలో డ్రైనేజ్ కాలువ నిర్మాణానికి రూ.6.33 లక్షలు కేటాయించామన్నారు. పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, జనిగర్ల మహేంద్రయాదవ్, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి (చందు), మండలి కృష్ణారావు, పానుగోటి అనురాధ, కలవకూరి ధనమ్మ, కలవలూరి శ్రీనివాసులు, చీదెళ్ల కిషోర్, తల్లపనేని ప్రభాకర్‌నాయుడు, షేక్ నాయబ్ రసూల్, సయ్యద్ షాలి, పద్మనాభరెడ్డి, శివరామిరెడ్డి, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కనుపర్తి రాజశేఖర్, పులి రజనీ, వింతా ప్రభాకర్‌రెడ్డి, దామిశెట్టి సుధీర్, వడ్లమూడి వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు స్థలంలో స్తంభాలు తొలగించండి


విద్యుత్ స్తంభాలు ఏర్పాటుపై నిరసన వ్యక్తం చేస్తున్న మైనార్టీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని సోమశిల రోడ్డు మలుపు వద్ద వక్ఫ్‌బోర్డు స్థలంలో విద్యుత్ హెచ్‌టీ లైన్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారని, వాటి వల్ల భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, వాటిని తొలగించాలని కోరుతూ మైనార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన చోట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సత్తార్, మైనార్టీ నాయకులు షేక్ రహీం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబరు 847 పూర్తిగా వక్ఫ్ బోర్డుకు చెందిన స్థలమని, ఆ స్థలం మధ్య భాగంలో విద్యుత్ అధికారులు ఇటీవల ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఆ స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టేందుకు వీలు లేకుండా ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా, షేక్ రిజ్వాన్, కలాం యస్దాన్ బాషా, లతీఫ్, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ ఆధార్ సీడింగ్


ఆధార్ సీడింగ్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

వరికుంటపాడు: మండలంలో పీఎం కిసాన్ నగదు పడని రైతులను వ్యవసాయశాఖ అధికారులు గుర్తించి ఆదివారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో వీఏఏ చంద్రశేఖర్ ప్రక్రియ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల నుంచి పీఎంకిసాన్ నగదు జమకాని 450 మంది రైతుల జాబితా వచ్చిందన్నారు. జాబితాను పరిశీలించి వ్యవసాయ భూమిలేని, మరణించిన వారిని గుర్తించామన్నారు. మిగిలిన సుమారు 140 మంది అర్హులను గుర్తించి ఆధార్ సీడింగ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు సుధీర్ పాల్గొన్నారు.

పోలేరమ్మ, అంకాలమ్మలకు పొంగళ్లు


ఖాదర్‌పూర్‌లో గ్రామదేవతలకు ఊరేగింపుగా నైవేద్యాలు తీసుకెళ్తున్న మహిళలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం ఖాదర్‌పూర్‌లో కొలువై ఉన్న పోలేరమ్మ, అంకాలమ్మ గ్రామ దేవతలకు ఆదివారం మహిళలు భక్తి శ్రద్ధలతో పొంగళ్లు పెట్టి దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. శ్రావణ మాసంలో ప్రతి సంవత్సరం తమ గ్రామ దేవతలైన పోలేరమ్మ, అంకాలమ్మ, సీతాలమ్మలకు మహిళలు సామూహికంగా ఇళ్ల వద్ద నుంచి పొంగళ్లు తెచ్చి నైవేద్యాలు సమర్పిస్తారు. గ్రామంలో పాడి పంటలు, పశు సంపదలు, ఆయురోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని కోరుతూ భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు.

ఆవులకు ఎండు గడ్డి వితరణ


రెండు ట్రక్కుల గడ్డిని నర్రవాడలో నిర్వాహకులకు అందజేస్తున్న రైతులు

కొండాపురం: నియోజకవర్గంలోని నర్రవాడ వెంగమాంబ తల్లి ఆలయ ప్రాంగణంలో గోశాలలో ఉన్న ఆవులకు మండలంలోని కొమ్మికి చెందిన రైతులు, యువకులు స్వచ్ఛందంగా రెండు ట్రాక్టర్ ట్రక్కుల ఎండుగడ్డిని గోశాల సంరక్షకులకు ఆదివారం అందజేశారు. కొమ్మి రైతులు మాట్లాడుతూ సుమారు ఈ గడ్డి విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు. త్వరలో మరలా రెండు ట్రక్కుల గడ్డిని అందించేందుకు కృషి చేస్తామన్నారు.

రెగ్యులర్ ఉద్యోగానికి చుట్టపు చూపు

ఉదయగిరి: విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేకనేక చర్యలు చేపడుతోంది. అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణాధికారి స్థానంలో ఉన్న ఒక అధికారి తీరు వ్యవస్థలో వివాదాలకు ఆజ్యం పోస్తున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడ ఉద్యోగం చేస్తున్నారో అక్కడే నివాసం ఉండాలనే నిబంధనలను విస్మరించి ఆ అధికారి తన స్వప్రయోజనాల కోసం రెగ్యులర్ మండలంతో పాటు నివాసం ఉండే ప్రాంతానికి ఇన్‌చార్జిగా వచ్చి చేరారు. రెగ్యులర్ మండలానికి చుట్టపు చూపుగా వెళ్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సీతారామపురం ఎంఈఓగా నియమితులైన మస్తాన్‌వలి ఏడాది కిందట తన పలుకుబడిని ఉపయోగించి ఉదయగిరికి ఇన్‌చార్జిగా పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఆయన ఉదయగిరిలో నివాసం ఉండడంతో ఎక్కువగా ఉదయగిరిలోనే ఉంటున్నారు. సీతారామపురం మండలాన్ని గాలికి వదిలివేశారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఇటీవల బదిలీల్లో ఉదయగిరికి ఎంఈఓను నియమించనప్పటికీ, మస్తాన్‌వలి ఉదయగిరిని వదల్లేదు. ఒక్కొక్క మండలానికి ఇద్దరు ఎంఈఓల పోస్టులు ఉన్నప్పటికీ, ఒకరు ఉన్నా అన్నీ పనులు నిర్వహించాలి. కానీ ఉదయగిరి వదిలి వెళ్లేందుకు ఇష్టపడని మస్తాన్‌వలి అక్కడే మకాం వేశారు. సీతారామపురానికి చుట్టపు చూపుగా వెళ్తున్నారనే విమర్శలు ఉన్నప్పటికీ, ఆయన వ్యవహార శైలి వివాదాలకు దారి తీస్తున్నాయి. 'అయిన వారికి అరటి కాకులో..' చందంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. తనకు నచ్చని వారిని అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారనే ఆరోణలు లేకపోలేదు. ఇది ఇలా ఉండగా ఇటీవల ప్రభుత్వం మండలంలో ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో నిబంధనలను పక్కన పెట్టి తనను ప్రసన్నం చేసుకున్న వారికి ఒకలా, వేరే వారికి మరోలా సర్దుబాటు జాబితా తయారు చేసి జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఉదయగిరి దళితవాడ పాఠశాలకు జూనియర్‌ను పంపాల్సి ఉన్నప్పటికి, సీనియర్‌గా ఉన్న రామకృష్ణారెడ్డి పేరు జాబితాలో పంపించడంపై వివాదం రేగింది. ఈ విషయంపై ఉపాధ్యాయ నేతలు ప్రశ్నిస్తే రోస్టర్ అనే నిబంధన 117 జీఓలో లేనప్పటికి, దాని ప్రకారం పంపానని చెబుతుండంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై డీఈఓ గంగభవానిని వివరణ కోరగా నిబంధనలు ప్రకారం జాబితా లేకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా


ట్యాంకర్ల ద్వారా నీరు పట్టుకుంటున్న ప్రజలు

ఉదయగిరి: పట్టణంలోని దేవలాలగడ్డ వీధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో వెంటనే ఆయన స్పందించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, మరో నాయకుడు షర్ఫుద్దీన్‌లకు సూచించారు. దీంతో వారు ఆయా ప్రాంతాలకు ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నా. పట్టణంలో చేపడుతున్న పైప్‌లైను పనులు త్వరితగతిన పూర్తి చేసి తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అప్పటి వరకు తాగునీటి సమస్య లేకుండా పట్టణంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటి ద్వారా చేయాలని ఆయన సూచించారు.

వరుడిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే మేకపాటి


వరుడిని ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలం పందిపాడు వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లంపాటి కొండారెడ్డి కుమారుడు అల్లంపాటి మదన్‌మోహన్‌రెడ్డి నలుగు కార్యక్రమానికి ఆదివారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి హాజరై నూతన వరుడిని ఆశీర్వదించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో పందిపాడులో వరుడి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే వరుడిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జేసీఎస్ కో ఆర్డినేటర్ పులిమి రమేష్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు రియాజ్ అహ్మద్, నారసింహారెడ్డి, జిలానీ, సూరా శ్రీనివాసులరెడ్డి, గోసల శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

నేటి నుంచి అవగాహన సదస్సులు

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో సోమవారం నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల జేసీఎస్ కో–ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో 4 ఏళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలు తీరు 2024లో జరిగే సాధారణ ఎన్నికల విధివిధానాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కన్వీనర్లకు, గృహ సారథులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నిధులతో బీమా సౌకర్యం ఏర్పాటు చేశారని తెలిపారు. మొదట 28వ తేదీ సోమవారం మండలంలోని సోమశిల, పడమటి ఖమ్మంపాడు గ్రామాల్లో జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

బాల్యవివాహాలపై సమాచారం అందించాలి

ఉదయగిరి: మండలంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాచారం అందించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండకుండా బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. చట్టపరమైన చర్యలతో పాటు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తారన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు

కావలి: ప్రతి పౌర్ణమికి అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం కావలి డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉంటే మరో బస్సును కూడా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ బస్సులు ఆగస్టు 30వ తేదీ ఉదయం 8 గంటలకు కావలిలో బయలుదేరి రాత్రికి అరుణాచలం చేరుతాయని, గిరిప్రదక్షిణ అనంతరం తిరిగి బయలుదేరి ఆగస్టు 31వ తేదీ సాయంత్రానికి కావలికి వస్తాయన్నారు. ఈ సర్వీసులకు సీట్ రిజర్వేషన్ చే యడం ప్రారంభించామని, గిరిప్రదక్షిణకు వెళ్లే కావలి ప్రజలు, భక్తులు ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలని డీఎం శ్రీనివాసులు కోరారు.

జిల్లా జంప్ రోప్ జట్ల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

కావలి: పట్టణంలోని పాతూరులో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఆదివారం జరిగిన జిల్లా 'జంప్ రోప్' జట్ల ఎంపిక చేపట్టారు. 80 మంది విద్యార్థులు హాజరు కాగా ఇందులో 40 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు 'జంప్ రోప్' క్రీడా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వచ్చే నెల 9, 10 తేదీల్లో తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికయ్యే విద్యార్థులు జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు.

33 మద్యం బాటిళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్‌ఐ ఎం.సూర్యప్రకాశ్‌రెడ్డి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వీరు నరసారెడ్డిపాళెంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారని తమకు సమాచారం అందడంతో నిఘా పెట్టి తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో బెల్ట్‌షాపు నిర్వాహకుల నుంచి 33 మద్యం బాటిళ్లను, మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం కృష్ణాపురం, బ్రాహ్మణపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మర్రిపాడు విద్యుత్‌శాఖ ఏఈ రామచంద్రయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నారు.

పెంచలస్వామి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ



ఆత్మకూరురూరల్: శ్రీహనుమాన్ భక్త పెంచలస్వామి జీవిత చరిత్రపై ప్రచురించిన పుస్తకాలను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మండలంలోని దేపూరులో ఆదివారం ఆవిష్కరించారు. అంతకు ముందు పెంచలస్వామి సమాధి వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు నాయుడు పెంచలనాయుడు, రావిళ్ల వెంకటేశ్వర్లు, కిషోర్‌రెడ్డి, కుక్కపల్లి శ్రీనివాసులు, తూమాటి శేషయ్య, తూమాటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ పొంగళ్లు

జలదంకి: జలదంకి పంచాయతీ కమ్మపాళెంలో ఆదివారం పోలేరమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక పొంగళ్లు, నైవేద్యం సమర్పణ, అమ్మవారి ఎదుట అంబళ్లు, అమ్మవారి మూలవిరాట్ విశ్వరూప దర్శనం తదితర కార్యక్రమాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

పోలేరమ్మ జాతరలో మేకపాటి


అమ్మవారి జాతరను తిలకిస్తున్న మేకపాటి

కొండాపురం: మండలంలోని గరిమెపెంటలో ఆదివారం జరిగిన గ్రామదేవత పోలేరమ్మ జాతరలో ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి పాల్గొన్నారు. ఆయనకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఏర్పాటు చేసిన ప్రభలను తిలకించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులందరూ కలిసి కట్టుగా ఇలాంటి జాతర చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కొండాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చిమ్మిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులరెడ్డి, స్థానిక ఎంపీటీసీ యానాదమ్మ, నాయకులు మునలారెడ్డి, వెంకటరెడ్డి రామిరెడ్డి, మహేష్, వెంకటేశ్వర్లు, వెంగలరావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం


మాముడూరులో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

చేజర్ల: మండలంలోని మాముడూరులో ధరణి సేవా సమితి ఆధ్వర్యంలో జేసన్స్ ఇండస్ట్రీస్ తమిళనాడు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో నూతన వాటర్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. ట్రస్ట్ సభ్యులు, కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ పారిశ్రామిక అనుమతుల కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని పరిశ్రమలు తమకు వచ్చిన లాభాల్లో 0.5 శాతం గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి వసతి పాఠశాలలు, వైద్యశాలల్లో వసతులకు వినియోగించే విధంగా ఉత్తర్వులు విడుదల చేసిందని, దీనికి అనుగుణంగా దేశంలోని అన్ని పరిశ్రమలు కూడా కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ యాక్టివిటీస్ తప్పని సరిగా చేయాల్సి ఉంటుందన్నారు. వీటిని కలెక్టర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ధరణి సేవా సమితి మేనేజింగ్ ట్రస్టీ యల్లా మంజుల, నాయకులు మూరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, తిరుమలరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఈశ్వరయ్య, ఎస్ పెంచలయ్య, గోపాల్ రెడ్డి, చంద్‌బాషా పాల్గొన్నారు.

సామాజిక సేవకుడు ప్రసన్నకు సన్మానం


ప్రసన్నను సన్మానిస్తున్న దృశ్యం

కావలి: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన కావలికి చెందిన సామాజిక సేవకుడు గంధం ప్రసన్నాంజనేయులును సంయుక్త సేవా సంస్థ ఆదివారం సన్మానించింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే ప్రసన్నాంజనేయులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బుర్లా రఘుకుమార్‌రెడ్డి, ఎం.అజిత్ బాబు, ఎంవీఎస్ ప్రసాద్ రావు, నేలటూరి శివప్రసాద్ రెడ్డి, షేక్ ఖాదర్ బాషా, దేవరకొండ విజయ్, బషీర్ అహ్మద్, మహమ్మద్ అహ్మద్, మహమ్మద్ రఫీ, అజీద్ అహ్మద్, అబ్దుల్ రెహమాన్, మహబూబ్ బాషా, వలంటీర్లు ప్రఫుల్లా, వెంగళరావు, గాయత్రి, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

48వ సారి రక్తదానం


రక్తదానం చేస్తున్న నవీన్

కావలి: లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాటికొండ నవీన్ కావలి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో శనివారం 48 సార్లు రక్తదానం చేశారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డాకా రపు రవిప్రకాష్ రక్తదాత నవీన్‌ని అభినందించారు. మదర్ థెరిస్సా తన జీవితాంతం వృద్ధుల, వికలాంగుల, నిర్భాగ్యుల సేవకే అంకితమయ్యారని, ఆ మహానీయురాలి జయంతి నాడు తనువంతు బాధ్యతగా కావలి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేశానన్నారు.

విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు


విశేష పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వరికుంటపాడు: వరికుంటపాడు ఎస్టీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో శనివారం నుంచి జరుగుతున్న విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించారు. రుత్విక్కులు వేకువజాము నుంచే సర్వదేవత్య హోమాలు, విగ్రహాలకు జలాది, క్షీరాది, ధాన్యాది వాసములు, గ్రామోత్సవం, భూతబలి, శయ్యాది, పుష్పాదివాసములు చతుర్వేద పారాయణాలు చేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు యంత్రబింబ, విగ్రహప్రతిష్ట, మహాకుంభాభిషేకాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతకు సన్మానాలు


ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని సత్కరిస్తున్న మర్రిపాడు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరురూరల్: మర్రిపాడు మండలం పెగళ్లపాడుకు చెందిన చెవుల శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా నియమితులైన నేపథ్యంలో ఆదివారం పలువురు నేతలను కలిసి సన్మానించారు. రాజ్యసభ సభ్యుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తదితరులను కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మర్రిపాడు మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, మాజీ చైర్మన్ చెన్ను శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాయుడు హజరత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి, చింతగుంట రామకృష్ణారెడ్డి, మౌలాలి, చల్లా వెంకటేశ్వర్లురెడ్డి, నూనె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.